
# మిలీనియం బేబి

ఎనుగంటి వేణుగోపాల్



నేను...రక్తమాంసాల ముద్దని.
అమ్మ కడుపులోని ఉమ్మ
నీటిలో పిండాన్ని...
గర్భస్థ శిశువుని !!
నేను సంపూర్ణాకృతి పొందక
ముందే నా స్వీకృతికి ఆటం
కం కలుగుతోంది.
నే నింకా పుట్టనే లేదు.
నా రాకని నిరోధించే ప్రయ
త్నం జరుగుతోంది.
ఎందుకో మరి ... !?

నాకైతే అమ్మ పొత్తిళ్ళలో చేరి అనందంతో కేరింతలు కొట్టాలని ఉంది. అమ్మ నన్ను ప్రేమగా హత్తుకుని ముద్దులతో మురిపెం చేస్తోంటే ఉబ్బి తబ్బిబ్బై పోవాలని ఉంది. ఆ వెచ్చని కౌగిలిలో వెన్న ముద్దనై కరిగిపోవాలని ఉంది.

కానీ కుదరద్దూ... ?! నాకెంత అదుర్దాగా ఉన్నా... సమయం రావొద్దూ ?!

నాలో ఇంత ఉత్సాహం ఉరకలు వేస్తోందా ?! అమ్మెందుకో విచారంగా ఉంది. నాకు బాధేసింది.

నేను పుట్టబోతున్నందుకు అమ్మ నవ్వుతూ కదా ఉండాల్సింది. లేదలా ! ఏవో ఆలోచనలతో సతమతమౌతోంది.

అర్థం కాకుండా ఉంది నాకు. అందుకే -

"అమ్మా... ! అమ్మా ... !!" అంటూ గొంతెత్తి బిగ్గరగా పిలిచాను.

ఆ పిలుపుకి తుళ్ళిపడి వెంటనే అమ్మ పొత్తి కడుపును ప్రేమగా నిమురుతూ-

"వూఁ...!" అని పలికింది నెమ్మదిగా.

"అమ్మా... ఎందుకలా దిగాలుగా ఉన్నావ్ ?"

"ఏవీ లేదులే !"

"ఏదో ఉంది. నాన్న గారేమైనా అన్నారా ?"

"వూహఁ...!!"

"నానమ్మ, తాతయ్య కోప్పడ్డారా ?"

"ఎవరూ ఏవీ అన్లేదులే !"

"మరెందుకలా ఉన్నావ్ ?"

"... ... ... ..."

"చెప్పవూ ?"

"చెబితే?"

"వింటాను."

"విని... ?"

"ఊరడిస్తాను !"

గలగలా నవ్వేసింది అమ్మ. తెరలు తెరలుగా నవ్వుతూనే ఉంది. చాల్చాలు. నా కదే చాలు. అమ్మ నిండుగా నవ్వుతూ కళకళలాడుతూ ఉంటే అంతకన్నా కావల్సిందేముంది.

అమ్మ తనివితీరా నవ్వాక-

"అమ్మా... అమ్మా... బాధగా ఎందుకున్నావో చెప్పవూ ?!" తిరిగి మారాం చేశాను.

"తొలి చూలు కాన్పు-ఆడపిల్ల అవబోతున్నందుకు ఇంట్లో వాళ్ళందరికీ బాధగా ఉంది" తటపటాయిస్తూ చెప్పింది అమ్మ.

"మొదటి ఆడ పిల్ల పుడితే ... ఇంట్లోకి మహాలక్ష్మి నడిచొచ్చిందంటారుగా !" కాస్త వేదనతో అడిగాను.

"అది వెనకటి మాట. ఇప్పుడెవరలా అనుకుంటున్నారు ?"

"అది సరే ! ఇంట్లో వాళ్ళు బాధ పెడుతున్నారని బెంగెట్టుకున్నావా ?"

"ఛ !... అదేం కాదు."

"మరెందుకలా విచారంగా ఉన్నావ్ ?"

"ఏవీ లేదన్నాగా ?"

"మరైతే నాన్నగారు ..."

"ఆయన కూడా మగాడే కదా ! నాన్న గారి అభిప్రాయం భిన్నంగా ఎందుకుంటుంది ? నీవు 'బాబు' వైతే ఎంత బాగుండేదంటున్నారు."

"మరి నీకు ? నేను స్వేచ్ఛగా బయటికి రావాలని లేదూ ?" గోముగా అడిగాను.

చప్పున నోరు మూసేస్తున్నట్టు పొత్తి కడుపుని ఆప్యాయంగా తడిమింది.

పొంగి పోయాన్నేను ! ఇన్ని మాసాలయ్యింది అమ్మ కడుపులో ఊపిరి పోసుకుని. అమ్మ మనసు నాకు తెలీదా ? అయినా ఊరికే అడిగా.

"పిచ్చి తల్లీ ! నీవు గర్భకోశం దాటి ఎప్పుడు బయటికొస్తావా అని ఆతృతగా ఉంది. నిన్ను క్షణం విడవకుండా ముద్దులతో ముంచెత్తాలని ఉంది. నీ లేత బుగ్గలు నిమిరి... బోసి నవ్వులు తడిమి... మైమరిచి పోవాలనుంది. తల్లినై పరవసించాలనుంది... నా బంగారు కొండవి కదా ! కానీ..."

అంటూ సంశయిస్తూ ఆగిపోయింది అమ్మ.

"ఏంటా... కానీ?" ప్రశ్నించాను.

"నీవూ ... ఆడ పిల్లవైనందుకే నాకు బాధగా ఉంది."

"అమ్మా !!" ఉద్వేగభరితంగా అరిచాను.

అమ్మ కూడా ఇంతేనా ? కనబోయే తల్లికి... నా కన్నతల్లికి కూడా ... ఆడపిల్లకి జన్మనివ్వాలని లేదా ! నేన్నమ్మను.

"ఏం ? నీవు మాత్రం ఆడదానివి కాదా అమ్మా ?" ఉక్రోశాన్ని అదిమిపడుతూ కాస్త కోపంగా అడిగాను.

"అయ్యెయ్యో నా బుజ్జి తల్లీ ! నా బాధ అది కాదమ్మా ! స్త్రీగా నేను పడ్డ కష్టాలు, ఆడదానిగా అనుభవిస్తున్న ఆరున్నొక్క ఆరళ్ళు నీవూ పడతావేమోనని ! అంతే తప్ప నీవంటే మమకారం లేదని కాదు. అనురాగమై నిన్నల్లుకు పోలేననీ కాదు". అమ్మ స్వరంలో కలవరపాటుతో కూడిన కించిత్ మార్పు.

ఆ సమాధానంతో కాస్త ఊరడిల్లాను. ఎంతయినా అమ్మ... అమ్మే కదా ! అని నాకు నేనే సరిపెట్టుకున్నాను.

"ఏం కష్టాలు పడ్డావేంటి ?" పెద్ద ఆరిందాలా ఆరా తీశాను.

"అలా అడుగుతోంటే నాకే నవ్వొచ్చింది.

పూర్తిగా నెలలయినా నిండని పసిగుడ్డుని... అమ్మ ఊపిరే ఊపిరై బతుకుతున్న దాన్ని.... అమ్మ రక్తమాంసాలు పంచుకుంటున్నదాన్ని...

అయినా నేనే తల్లినైనట్టు, నేనే అమ్మనైనట్టు... నేను బెదిరిస్తున్నా వూర్కుంటుందేం ? అప్పుడప్పుడూ ప్రేమగా పొత్తి కడుపుని నిమురుతూ నన్ను లాలిస్తుందేం ?

నన్ను కసురుకోవడం కానీ, నాపై విసుగు ప్రదర్శించడం కానీ చేయడం లేదు. ఎంత ఓపిక ప్రదర్శిస్తోంది. ఎంతయినా అమ్మంటే సహనానికి ప్రతిరూపం కదూ !?

"క్షమయా ధరిత్రి... అని ఎవరో అంటుంటే విన్నాను. అమ్మ అంటే అంతే కదా !! ఎంత ఓర్మి ? ఎంత సహనం ? నిజంగా నీవు గొప్పదానివమ్మా !"

మనసులో అనుకున్నా పైకి అభినందించకుండా ఉండలేకపోయాను.

అమ్మ మాత్రం అదేమీ పట్టనట్టు ...

"ఏమో ? నా కవన్నీ తెలీదు... నేను పెద్దగా చదువుకోనూ లేదు" అంది నిర్లిప్తంగా.

"చదువుకోలేదా ! ఎందుకని ?" ఆశ్చర్యపోయాను.

"అదంతేలే, ఆడపిల్లను కదా ! చులకనగా చూసేవారు. ఆడ పిల్లలకి పెద్ద పెద్ద చదువులెందుకన్నారు. వండి వార్చి మొగుడికి ఇంత వడ్డించే దానికి అంతగా చదువెందుకు ? ఉత్తరం ముక్క రాయొస్తే చాలన్నారు.

మా అన్నయ్య చదువులో మొద్దయినా, డొనేషన్లు కట్టి మరీ పై చదువులు బలవంతంగా చదివించారు. క్లాసులో ఫస్టొస్తున్నా... ఇంటి పేరు మారేదాన్నని... నన్ను మాత్రం వీధి బడి చదువుతో మాన్పించేశారు."

"ఇంకా చదువుతానని మొండికేయ లేదా ?"

"అమ్మో ! ఎదిరించి ధైర్యంగా అడగడమే ! అమ్మా, నాన్న చెప్పింది చేయడం-వినడం తప్ప మరొకటి తెలీదు. అంతెందుకు ? ఏదడిగినా కాదనకుండా అన్నయ్యకు అన్నీ కొనిపెట్టేవారు. పుత్రరత్నం కదా అందుకని నన్నేమో పట్టించుకునేవారు కాదు. ఎంతయినా గుండెల మీద కుంపటిని కదా." ఆర్తిగా చెబుతోంది అమ్మ. సావధానంగా వింటుండిపోయాను.

"కూతురు నుండి కోడలిగా ఈ ఇంట్లోకి అడుగుపెట్టినా 'పాత్ర' లో తప్ప పరిస్థితిలో మార్పు లేదు. రోజూ బండెడు చాకిరీ చేసినా ఓదార్పు లేదు... ఏ ఒక్కరూ సానుభూతి చూపరు. చివరికి మీ నాన్న కూడా. పంజరంలో చిలకని... అంతే !" అంటూ నిట్టూర్చింది అమ్మ.

"అదేంటమ్మా ! అలా వాపోతున్నావు ? మహిళా సంఘాలు, స్త్రీ సమానత్వం, స్త్రీ స్వేచ్ఛ... అంటూ వినపడుతున్నాయి కదా !"

"ఏమో తల్లీ ! నా కంటూ ప్రత్యేక వ్యక్తిత్వం లేదిక్కడ. నీడలా బతుకు వెళ్ళదీస్తున్నాను తప్ప వాస్తవమై నిలబడలేక పోతున్నాను. ఆశల్ని చంపుకోవడం... అభిరుచుల్ని అణుచుకోవడం... పైకి మాత్రం ప్లాస్టిక్ నవ్వుల్ని పెదవుల మీద పులుముకోవడం... అంతేనమ్మా ఈ యాంత్రిక జీవనం.

కూతురుగా, చెల్లిగా, భార్యగా, కోడలిగా... రూపాంతరాలు చెందుతూ నలిగిపోయాను. అనురాగ దీపమై నే వెలిగినా నా చుట్టూ అంధకారమే అలుముకుంది... అందుకేనమ్మా పుట్టబోయే నీవూ ఆడపిల్లగా ఎన్నెన్ని కష్టాలు అనుభవిస్తావోనని నా బెంగ".

"అయ్యో ! నీ వెంత అమాయకురాలివమ్మా ?"

"నేనే కాదు చిట్టితల్లీ ! రూపాలు వేర



యినా, క్రియలు మారినా ఏ ఆడ 'పాత్ర' కయినా తిప్పలింతేనమ్మా. తానే 'అక్షయపాత్రై' అందరి అవసరాలకీ బాధ్యతగా సమకూరుస్తుంది. కానీ తాను మాత్రం బాధల్ని మిగల్చుకుంటుంది."

"కష్టాల రేఖలేమయినా నీ నుదుటి మీద గీయబడి ఉన్నాయా ? చాకిరీ చేయాలన్నదే స్త్రీ జాతకమా ?"

నే ప్రశ్నిస్తోంటే మౌనంగా ఉండిపోయిందా తల్లి.

> కూతురుగా, చెల్లిగా, భార్యగా, కోడలిగా... రూపాంతరాలు చెందుతూ నలిగిపోయాను. అనురాగ దీపమై నే వెలిగినా నా చుట్టూ అంధకారమే అలుముకుంది... అందుకేనమ్మా పుట్టబోయే నీవూ ఆడపిల్లగా ఎన్నెన్ని కష్టాలు అనుభవిస్తావోనని నా బెంగ".

తిరిగి నేనే అన్నానిలా.

"రేపటి స్త్రీ జ్యోతిష్యం నే చెబుతా విను... ఆడదాని జీవితం 'అశ్రుకణం' కాదు 'ఆనంద భాష్పమని' లోకానికి ఎలుగెత్తి చాటుతాను.

పగలు సూర్యుడెంతో, రాత్రివేళ చంద్రుడూ అంతే ! ఎవరి బాధ్యతలు వారివి. చమురు లేనిదే వత్తి వెలగదు... వత్తి వెలగనిదే దీపానికి ఉనికి ఉండదు. ఇల్లాలే అనురాగ దీపమై... మగవాడి జీవితానికి వెలుగు రేఖలు విరజిమ్ముతుంది. అందుకే కొత్తదనానికి స్వాగతం పలుకుతానమ్మా ! శిశిర నేపథ్యాన్ని వదిలేసి నవవసంతాన్ని ఆవిష్కరిస్తాను. మూగవోయిన కోయిలమ్మకి ఆమని చివురు తినిపించి సరికొత్త రాగాలు ఆలాపింపచేస్తాను."

అమ్మ అబ్బురపడుతోంది నా మాటల్ని వింటూ !

తిరిగి గొంతెత్తాను-

"నేను జన్మనెత్తితేనే కదమ్మా... నాన్న 'తండ్రి' అయ్యేది. ఆడదాని కడుపు పండితేనే కదమ్మా... మరో 'మగాడు' కళ్ళు తెరిచేది. వధువు తాళి కట్టించుకుంటేనే కదమ్మా... వరుడు 'భర్త' గా మసిలేది. ఆధారం ఆడదే అయినప్పుడు అవమానభారాలు తిరిగి ఆడదానికే ఎందుకమ్మా ? ఆ అవకాశం మగాళ్ళకెందుకివ్వాలమ్మా ?"

కనురెప్పలల్లార్చి అమ్మ ఆసక్తిగా వింటోంది.

అమ్మ ఊపిరి నులి వెచ్చగా తగుల్తుంటే ప్రపంచాన్ని జయిస్తున్నంత ఆనందం కలుగుతోంది.

అమ్మ మురిపెంగా పొట్ట స్పృశిస్తోంది... నను లాలిస్తున్నట్టు ! కొత్త తరానికి నాందికమ్మని ఆశీర్వదిస్తున్నట్టు... ! తనువెల్లా పులకరించి పోయాను.

నాలాగే నా తరం బేబీలంతా ఆలోచించి స్త్రీ జాతికే ఓ నూతన ఒరవడి తెస్తే ఎంత బావుణ్ణు ?

★ ★ ★ ★

ఇల్లంతా సందడిగా ఉంది. బంధు జనమంతా హడావుడిగా వచ్చేస్తున్నారు.

పచ్చ పచ్చని తోరణాలు... రంగు రంగుల అలంకరణలు... ఇల్లంతా సందడే సందడి !

ఎందుకో తెలుసా ?

ఈ రోజు నా బారసాల !

ఉమ్మ నీరు దాటి... అమ్మ పేగు తెంచుకుని ... బొడ్డూడి ... భూమ్మీదికి అడుగిడుతుంటేనే... నా పోరాటం ఆరంభమైంది.

ఆశ్చర్యపోతున్నారంతా !

ఒకింత గుసగుస కూడానూ !!

అందరి పాపాయిల్లా పుట్టగానే వెక్కి వెక్కి ఏడవకుండా, గలగలా నవ్వేశానని... ఇప్పటికీ అలాగే హాయిగా నవ్వుతూ ఉన్నానని.

అయితే జీవితాంతం నవ్వుతూనే, బతుకంతా తుళ్ళుతూనే, కూతురునై-సోదరినై-భార్యనై-తల్లినై..... మమతానుబంధాల జీవన కావ్యంలో మధుర చరణాన్నై.... నిలవబోతున్నానని........

అమ్మకి మాత్రమే తెలుసు...... !!

కథ